## క్లుప్తంగా

### మూడో రోజు రెండు నామినేషన్లు దాఖలు

కర్నూలు (టౌన్) : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు శనివారం ఇరువురు ఇండిపెండెంట్లు తమ నామినేషన్లు దాఖలు పరిచారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజకు బుధవారపేటకు చెందిన పులిజాకబ్, అలాగే దేవనగర్‌కు చెందిన సింగారి చంద్రశేఖర్ నామినేషన్లు సమర్పించారు. ఇండిపెండెంట్‌గా నామినేషన్లు వేసిన వీరిరువురికి రిటర్నింగ్ అధికారి ప్రతిజ్ఞ చేయించారు. ఈనెల 18 వ తేదీ నుంచి ఇప్పటి వరకు కర్నూలు నియోజకవర్గానికి 11 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

### ఓటు హక్కు వినియోగించుకోండి



ఓటు హక్కు వినియోగించుకుందామని ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

కర్నూలు (టౌన్) : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు డాక్టర్ పెంచలయ్య అన్నారు. శనివారం స్థానిక నగరంలోని 195 నుంచి 203 పోలింగ్ స్టేషన్ పరిధిలోని పెద్ద మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు స్వీప్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెలలో నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

### ఏపీ న్యాయయాత్రను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): నగరంలో ఆదివారం ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల నేతృత్వంలో జరిగే ఏపీ న్యాయ యాత్రను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు, కర్నూలు ఎంపీ అభ్యర్థి జి.రాంపుల్లయ్య యాదవ్ ప్రజలను కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు బళ్లారి చౌరస్తా నుంచి యాత్ర ప్రారంభమై గడియారం ఆసుపత్రి వరకు కొనసాగుతుందని చెప్పారు.

### కేవీఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

కర్నూలు (సిటీ) : కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ నూర్ బాషాకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.కర్నూలు జిల్లా చరిత్రకు సంబంధించిన అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ అవార్డు లభించింది. ఈనేపథ్యంలో శనివారం ఆ కాలేజీలో ప్రిన్సిపల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ నూర్‌బాషాను ప్రత్యేకంగా అభినందించారు. కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ దేవికారాణి, చరిత్ర విభాగం అధ్యాపకులు జి.రాధారమణి, ఎ.జయలక్ష్మి, జి.విజయలక్ష్మి తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

### మిగిలిపోయిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

సి.బెళగల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి సంబంధించి మిగిలిపోయిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సి.బెళగల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష రాసి సీట్లు రాని విద్యార్థులకు వారుపొందిన మార్కుల ఆధారంగా 1:3 నిష్పత్తిలో ఈనెల 26వ తేదీ చిన్నటేకూరులోని గురుకుల కళాశాలలో సీట్లను కేటాయిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలో ఎస్సీ విద్యార్థులు 44 నుంచి 23 మార్కులు, ఎస్టీలు 40 నుంచి 25, బీసీలు 47 నుంచి 45, ఓసీలు 46 నుంచి 44, బీసీ–సీలు 17 నుంచి 14 మార్కులు పొంది ఉంటే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. పూర్తి వివరాలకు స్థానిక పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

సి.బెళగల్: మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వంశీ మోహన్ తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న 144 మంది అభ్యర్థులకు ఆరు గదులను కేటాయించామని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే రావాలన్నారు.

### కబడ్డీ విజేత ప్యాపిలి

పాణ్యం: దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా మండల పరిధిలోని ఎస్.కొట్టాల గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. మొదట స్థానం సాధించిన ప్యాపిలి జట్టుకు రూ. 50 వేలు, రెండో బహుమతి మిషన్ ప్రకాశం జిల్లా రూ. 35 వేలు, మూడో బహుమతి ప్రకాశం జిల్లా రూ.20 వేలు, నాల్గో బహుమతి హెతర్ జూయిర్ రూ.15 వేలు, ఐదో బహుమతి తొగర్చేడు రూ. 10వేలు, ఆ తర్వాత వరుసగా తమిళనాడు రూ. 6వేలు, బాబోలు రూ. 4 వేలు, బుగ్గానిపల్లె జట్టు రూ. 2 వేలు అందుకున్నాయి.

# టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

- కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- టీడీపీ, బీజేవైఎం, కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకుడు కొత్తపేట మున్నా తదితరులు



టీడీపీ, బీజేవైఎం నాయకులకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

కర్నూలు (టౌన్): ' నేరుగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము లేక టీడీపీ అధినేత చంద్రబాబు వివిధ పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు. గెలుపుకోసం ఆయన ఇలా ఎన్ని పార్టీలతో కలిసి వచ్చినా ఫలితం శూన్యం. తెలుగుదేశానికి ఇవే చివరి ఎన్నికలు అవుతాయి' అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నరసింగరావుపేటలోని ఆ పార్టీ నగర కార్యాలయంలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎస్వీమోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు అహమ్మద్ అలీఖాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకు ముందు తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఈశ్వరయ్య, భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అరుణ్ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరికి వారు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేసినందుకు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రజలకు న్యాయం జరగాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. వైఎస్ జగన్ ఐదేళ్లలో అందించిన ప్రజారంజక పాలనను చూసిన చంద్రబాబు ఎన్నికల్లో గెలవలేనని జనసేన, బీజేపీతో పాటు రహస్యంగా కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారన్నారు. ముస్లింల రిజరేషన్లు రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీతో చంద్రబాబు జత కట్టడం విచారకరమన్నారు. అధికారం కోసం కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్న బాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలులో బలమైన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అన్నారు. ఇంటింటికి సంక్షేమం అందించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు. కర్నూలు నియోజకవర్గంలో మూడో సారి పార్టీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. పార్టీలో చేరిన టీడీపీ, బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలన నచ్చి తాము ఈ పార్టీలో చేరినట్లు ప్రకటించారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**పార్టీలో చేరిన జొహరాపురం వాసులు**

స్థానిక 18 వ వార్డు జొహరాపురం కాలనీకి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. స్థానిక నాయకులు మక్బూల్, సమీ, సమీర్, జునైద్, జహీర్, వలీ, లాజర్, టైలర్ శీను, మోహన్, సలీం, లేపాక్షి ఆధ్వర్యంలో 300 కుటుంబాలు పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మీ అందరికి అండగా ఉంటానని చెప్పారు.

**కాంగ్రెస్‌ను వీడిన కొత్తపేట మున్నా**

స్థానికంగా మంచి సంబంధాలు కలిగిన కొత్తపేట మున్నా కాంగ్రెస్ పార్టీని వీడారు. శనివారం స్థానిక నరసింగరావు పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపు నిచ్చారు.

## ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

- ఎన్నికల ప్రచారంలో ఇంతియాజ్

కర్నూలు (టౌన్): ప్రజారంజక పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారని చెప్పారు. శనివారం స్థానిక ఆరోరానగర్, బుధవారపేటలో మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎస్వీమోహన్ రెడ్డితో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. పేదలను ఆదుకునే జగనన్నకు మద్దతు తెలియజేయాలన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలను పట్టించుకోని చంద్రబాబు బూటకపు హామీలు ఇస్తున్నారన్నారు. ప్రజలు నమ్మితే మళ్లీ ఇబ్బందులు తప్పవన్నారు. రిటైర్డు ఐఎఎస్ అధికారిగా పనిచేసిన తనకు పాలనలో అనుభవం ఉందని, తనను గెలిపిస్తే నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే కాకుండా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు జగనన్న పాలన పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. పేదల సంక్షేమానికి జగనన్న పెద్ద పీట వేశాడన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో పేద ప్రజలను తెలుగుదేశం పార్టీ దోపిడీ చేసిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆ పార్టీని నమ్మవద్దని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఇంతియాజ్‌ను గెలిపించాలని కోరారు.



వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

### 23న వీర హనుమాన్ విజయ శోభాయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ

కర్నూలు కల్చరల్: బలోపాసన దివసను పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన వీరహనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ పేర్కొన్నారు. శనివారం వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్రను వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రారంభిస్తారన్నారు. వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి మాట్లాడుతూ 500 సంవత్సరాల పోరాటం తరువాత దేశ అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పుతో గత జనవరి 22 వ తేదీన బాల రాముని మహా ప్రాణ ప్రతిష్ఠ జరగటానికి ఎంతో మంది తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ మీనుగ రాజేష్ మాట్లాడుతూ శోభా యాత్ర సాయంత్రం 4.30 గంటలకు పాతబస్తీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠం వద్ద ప్రారంభమై చిత్తారి వీధి, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ కూడలి, గడియారం ఆస్పత్రి, పెద్ద మార్కెట్, పాతబస్టాండ్ అంబేద్కర్ కూడలి, కోట్ల కూడలి, గోశాల, స్వామి వివేకానంద కూడలి (రాజ్ విహార్) మీదుగా బుధవారపేట ఓంసాయి శ్రీ సీతా రామాంజనేయస్వామి ఆలయం వరకు సాగుతుందన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, హిందూ బంధువులు అందరూ ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, జిల్లా కార్యదర్శి మాలిగి భానుప్రకాష్, సహకార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ, నగర కన్వీనర్ భగీరథ, తదితరులు పాల్గొన్నారు.

### ఓటేసి గెలిపించుకుందాం

కర్నూలు(సెంట్రల్): వచ్చే ఎన్నికల్లో పాణ్యం అసెంబ్లీ స్థానం నుంచి ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న డి.గౌస్‌దేశాయ్‌ని ఓటేసి గెలిపించుకుందామని వామపక్ష పార్టీల నేతలు అన్నారు. శనివారం నగరంలోని ఎద్దుల ఈశ్వరరెడ్డినగర్‌లో సీపీఎం, సీపీఐ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం నుంచి పాణ్యం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ నుంచి కె. జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఇండియ కూటమి అభ్యర్థిని గెలుపించుకుంటామని ఈ సందర్భంగా వారు తీర్మానం చేశారు.

## ఫొటోగ్రాఫర్ కూతురికి రూ.27 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



విద్యార్థినిని అభినందిస్తున్న రవీంద్ర కళాశాల చైర్మన్

కర్నూలు(సిటీ): ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాపార దిగ్గజ సంస్థగా పేరొందిన వాల్‌మార్ట్ నిర్వహించిన కొడెహెర్స్ ఇంటర్న్‌షిప్‌లో రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థిని రూ.27 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం పొందారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన గొల్ల గోవిందరాజులు, జి.శ్రీలత దంపతుల కుమార్తె గొల్ల హరిప్రియ రవీంద్ర ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఈసీఈ బ్రాంచ్ చదువుతున్నారు. వాల్‌మార్ట్ సంస్థ 2024–25 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులకు కొడెహెర్స్ ఇంటర్న్‌షిప్ ఎంపిక ప్రక్రియ చేపట్టింది. ఇందులో ఎంపికైనవారికి రెండు నెలల ఇంటర్న్‌షిప్‌తో పాటు వాల్‌మార్ట్ సంస్థ రూ.లక్ష స్టైఫండ్ ఇవ్వనుంది. ఇంటర్న్‌షిప్ పూర్తయిన తర్వాత ఏడాదికి రూ.27 లక్షల ప్యాకేజీతో ఉద్యోగంలో చేర్చుకున్నారు. హరిప్రియ తండ్రి కళ్యాణదుర్గంలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. ఈసీఈ బ్రాంచ్ 3వ సంవత్సరం చదువుతున్న సందర్భంలోనే ఈ అవకాశం రావడం విశేషం.

## నేటి సాయంత్రం లోపు మరమ్మతు పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో చేపట్టిన మరమ్మతు, ఆధునీకరణ పనులను ఆదివారం సాయంత్రంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. అతిథి గృహం ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న గోడలను సరిచేయాలని, వెంటనే కలర్ వేసే పనులు పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు పాల్గొన్నారు.

## యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

- ప్రమాదంలో తలకు తీవ్రగాయం
- ఆరోగ్యశ్రీ ద్వారా ప్రాణం పోసిన వైద్యులు



కోలుకున్న రాజశేఖర్‌తో వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్):తలకు తీవ్ర గాయమై ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న ఓ యువకుడికి కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణం పోశారు. వివరాలను హాస్పిటల్ న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వకుమార్ వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే...'2022లో అమకతాడు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకురాగా న్యూరోబృందం సంరక్షణలో అతనికి అవసరమైన వైద్య పరీక్షలు చేశాము. అతని పుర్రె పూర్తిగా దెబ్బతినడమే గాక రక్తం గడ్డకట్టినట్లు తేలింది. వెంటనే అతనికి పెట్రోనిలా క్రానియోటమి అనే ఫంట్రోటెంపోరల్ క్రానియోటమీ అనే సర్జరీ నిర్వహించాము. తర్వాత కోలుకోవడంతో అతన్ని డిశ్చార్జ్ చేశాము. అయితే మళ్లీ ఏప్రిల్ 17న అతనికి బ్రెయిన్ ఫీవర్ రావడంతో ఎమర్జెన్సీ విభాగానికి వచ్చాడు. సాధారణంగా ఎవ్వరికైనా జ్వరం వస్తే 5 నుంచి 6 రోజుల్లో అది మెదడుకు సోకుతుంది. కానీ ఈ రోగికి ఒక్క రోజులోనే మెదడుకు సోకడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. ముక్కు నుంచి రక్తం, సీఎస్ఎఫ్ ద్రవం కారింది. వైద్యపరీక్షలు నిర్వహించగా ముక్కు నుంచి మెదడుకు ఉండే బోన్‌కు రంధ్రం ఉన్నట్లు తేలడంతో శస్త్రచికిత్స చేసి అతని ప్రాణాలు కాపాడాము. ఈ ప్రక్రియలో తనతో పాటు న్యూరాలజిస్టు డాక్టర్ నాగసురేష్ బృందం పాల్గొన్నట్లు' ఆయన తెలిపారు. రెండుసార్లు నిర్వహించిన చికిత్సను పూర్తిగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై. మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియకు పకడ్బందీ చర్యలు

- రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ



సెక్టోరల్, స్పెషల్ ఆఫీసర్ల సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని 137 కర్నూలు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌తో కలిసి కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ సెక్టోరల్ ఆఫీసర్స్, స్పెషల్ ఆఫీసర్స్, నగరపాలక ఇంజినీరింగ్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు, బారికేడ్లు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

**ఎన్నికల సామగ్రి పరిశీలన**

నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో శనివారం 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. పోలింగ్ ముందు రోజు ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డీఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

**నంద్యాల చెక్‌పోస్టు తనిఖీ**

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సుంకేసుల రోడ్డులోని కార్తిక్ హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని అక్రమ మద్యం, డబ్బు తరలింపుపై నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో పేదలకు సంక్షేమం, విద్య, వైద్యం అందించటడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దూపాడు, పెద్దటేకూరు, తడకనపల్లె, వామసముద్రం, ఓబులాపురం, తాండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల్లో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో పేదలు అనారోగ్యం పాలైతే అప్పులు చేసి కుటుంబ సభ్యలను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల ఉంచి రూ. 25లక్షల వరకు పెంచామని చెప్పారు. మనబడి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ పాఠశాల స్థాయిలో తీర్చిదిద్దామని తెలిపారు. పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాలో అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ. 15వేలు ఆర్థికం సహాయం అందిస్తున్నామన్నారు. మే 13న జరగనున్న సార్వత్రి ఎన్నికల్లో పాణ్యం ఎమ్మెల్యేగా తనను, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మునిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతురెడ్డి, మహేష్, చంద్రారెడ్డి, పెద్ద ఈశ్వరయ్య, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కృష్ణరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

**టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక**

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు భారీగా జరుగుతున్నాయి. శనివారం కల్లూరు అర్బన్ పందిపాడుకు చెందిన 40 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ నాయకులు కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, టీయూసీ భీమేష్‌రెడ్డి, రవి ఆధ్వర్యంలో ప్రసాద్ చౌదరి, భవాని భాయ్, 400 కుటుంబాల కార్యకర్తలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

### పెద్దాసుపత్రికి వైద్యపరికరాల విరాళం



వైద్యపరికరాలు విరాళంగా అందజేస్తున్న జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు స్థానిక జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ వారు వైద్యపరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డికి విరాళంగా అందజేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉపయోగపడేందుకు ఈ పరికరాలు అందజేసినట్లు ఆ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో వెంకీ కంపెనీకి చెందిన సెక్షన్ ఆపరేటర్ ఒకటి, స్టాండింగ్ డైమండ్ బీపీ ఆపరేటర్లు 15 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, జెమ్‌కేర్ కా మినేని హాస్పిటల్ సీఓఓ డాక్టర్ గణేష్, జనరల్ మేనేజర్ నదీమ్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ సమస్యలపై వినతి

కర్నూలు (సిటీ) : ఉపాధ్యాయులు తమ జీతాలకు సంబంధించిన బిల్లులు సబ్‌మిట్ చేసే సమయంలో కొత్తగా మ్యాపింగ్ సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని వెనువెంటనే పరిష్కారం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం పలువురు ఉపాధ్యాయులు అసిస్టెంట్ ట్రెజర్ ఆఫీసర్ జయలక్ష్మిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

### భావితరాలకు ప్రకృతి వనరులు అందిద్దాం



పర్యావరణ పరిరక్షణ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: భావితరాలకు ప్రకృతి వనరులు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేంద్ర గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథ పాలకులు పెద్దక్క అన్నారు. శనివారం మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయంలో 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్' అనే అంశంపై వ్యాసరచన, చిత్ర లేఖన పోటీల ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విశ్రాంత ఫారెస్ట్ అధికారులు జయచంద్రారెడ్డి, చంద్రశేఖర్, లయన్స్ అడిషన్ క్యాబినెట్ సెక్రటరీ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడారు. విజేతలకు ఈనెల 22 వ తేదీన బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు చెప్పారు. అంతకు ముందు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు పాల్గొన్నారు.